# మూగపిల్ల

**వాణిశ్రీ**




చాలాకాలం తర్వాత రామ్మోహన్‌రావుని కలవడం సుదర్శన్‌కి ఆనందం కలిగించింది. అతను వైజాగ్ నుంచి హైదరాబాద్‌కి హైకోర్టు పనిమీద వచ్చాడు. ఆంధ్రా యూనివర్శిటీలో ప్రొఫెసర్‌గా పనిచేసి రిటైరయ్యాడు.

"అన్నయ్యగారూ! బాగున్నారా?" అంటూ పలకరించింది సుదర్శన్ భార్య సీతాదేవి.

"బాగున్నానమ్మా! నీ ఆరోగ్యం ఎట్లా వుంది?" అని పరామర్శించాడు రామ్మోహనరావు.

"ఏదో బండి నడుస్తోంది. నాకు సుగర్, కీళ్ళనొప్పులు. మందులతో బతుకుతున్నాననుకోండి" అన్నది.

"నువ్వేంటమ్మా! ఇప్పుడు అందరూ మందులమీద బతికేవాళ్ళే. ముసలివాళ్ళు మరీను. జబ్బులేని వాళ్ళెవరు చెప్పు. నాకు గ్యాస్ట్రబుల్, బి.పి. అల్సర్‌లోకి దించి ఆపరేషన్ చేయాలంటారేమోనని హడలి ఛస్తున్నాను" అన్నాడు రామ్మోహన్‌రావు.

సీతాదేవి పనిపిల్లతో కాఫీ కప్పులు ట్రేతో తెప్పించి తన పనిమీద వెళ్ళిపోయింది.

పనిపిల్ల ట్రే టీపాయ్ మీద వుంచింది. ఆ పిల్లకు పదహారేళ్ళుంటాయేమో? చుడీదార్ వేసుకుని శుభ్రంగా వుంది. చామనఛాయలో వున్నా ముఖంలో కళ వుంది. కోల ముఖం, పెద్ద పెద్ద కళ్ళు. వయసులో వుందేమో పుష్టిగా ఆరోగ్యంగా కనిపిస్తోంది. సుదర్శన్ వంటి శ్రీమంతుడి ఇంట్లో మంచి ఆహారానికి కొదవేముంది?

రామ్మోహన్‌రావు గ్లాసులో నీళ్ళు తాగి ట్రేలో పెట్టేశాడు. మరొక గ్లాసు నీళ్ళు తాగాలనిపించింది. జర్నీ చేసి వచ్చాడేమో గొంతు ఆర్చుకుపోతోంది.

"ఏయ్! అమ్మాయ్ ఇంకొక గ్లాసు మంచినీళ్ళు పట్టుకురా!" అన్నాడు, దాహంగా వుందని సంజ్ఞ చేస్తూ.

ఆ పిల్ల గ్లాసుతో నీళ్ళు తెచ్చి అందించింది.

"నీ పేరు ఏమిటి?" అడిగాడు.

ఆ పిల్ల అతన్ని ఎగాదిగా చూస్తోంది. సమాధానం చెప్పలేదు.

"నిన్నే! నీ పేరేంటి?" రెట్టించాడు.

సుదర్శన్ నవ్వి "దానికి మాటలు రావు. మూగది" అన్నాడు.

రామ్మోహన్‌రావు ఆ పిల్లవైపు ఆశ్చర్యంగా చూస్తుంటే సుదర్శన్ చెప్పాడు..."పిల్ల చక్కగా వుంది. పని పాటలు బాగా చేస్తుంది. ఇది వచ్చిన తర్వాత ప్రాణానికి హాయిగా వుంది. లేకపోతే ఏ పనిమనిషీ ఎక్కువ రోజులు వుండేది కాదు. పాపం దీనికి నోరివ్వలేదు భగవంతుడు"

రామ్మోహన్‌రావు ఇంట్లో వున్నంత సేపు ఆ పిల్లని గమనిస్తున్నాడు. పేరు బామిని అట. పనులన్నీ చకచక చేస్తోంది. ఇల్లు వూడ్చి, ఫినాయిల్‌తో తుడిచింది. గీజర్ ఆన్ చేసి అతనికి వేడి నీళ్ళుతోడింది. సీతాదేవికి కిచెన్‌లో అంట్లుతోమి, కూరగాయలు తరిగి హెల్ప్ చేస్తోంది. ఏ పని చెప్పినా చిటికెలో చేసేస్తోంది.

సుదర్శన్ పిల్లలు ఎవరూ దగ్గర లేరు. అమెరికాలో సెటిలయ్యారు. ఇతను కూకట్‌పల్లి, వివేకానందనగర్లో ఇండిపెండెంట్ హౌస్ కట్టించుకుని, ఎలక్ట్రానిక్ షాపు నడుపుతున్నాడు. ఇంకా నీకు బిజినెస్ ఎందుకంటే? కాలక్షేపానికి అంటాడు.

రామ్మోహన్‌రావు లాయర్ దగ్గరికి బయల్దేరుతూ అన్నాడు-

"ఆ పిల్ల దొంగ. తొందర్లో పని మాన్పించెయ్"

సుదర్శన్ హడిలిపోయాడు ఆ మాట విని.

"జోక్ చేస్తున్నావేరా? నువ్వొచ్చి గంట కాలేదు. దాన్ని గురించి అప్పుడే ఏం తెలుసుకున్నావు? అది ఇంట్లో నుంచి కదలదు. ఇంట్లోనే వుంటుంది ఇరవై నాలుగు గంటలు. ఏ దొంగతనం చేస్తుంది? అది మా అదృష్టం కొద్దీ దొరికింది" అన్నాడు సుదర్శన్.

"అదృష్టం దురదృష్టంగా మారకముందే దాన్ని వదిలించుకో" అన్నాడు రామ్మోహనరావు నవ్వుతూ.

"నువ్వు చెప్పావని దాన్ని దొంగ అని పొమ్మంటే సరిపోతుందా?" అన్నాడు సుదర్శన్.

"సరే! వుంటాగా! అది దొంగని నిరూపించిపోతాను" అన్నాడు రామ్మోహన్‌రావు.

"నువ్వు ముందు ఆ కోర్టు పని పూర్తి చేసుకో! మనం సరదాగా రెండు రోజులు సిటీలో ఎంజాయ్ చేద్దాం" అన్నాడు సుదర్శన్.

రామ్మోహనరావు తల వూపి బయల్దేరాడు.

★ ★ ★

ఆ రోజు సీతాదేవి స్నానం చేయడానికి వెళ్తూ రెండు జతల బంగారు గాజులు బెడ్‌రూమ్‌లోని డ్రెస్సింగ్ టేబుల్ మీద వుంచింది. ఆమె తిరిగి వచ్చేసరికి ఆ గాజులు లేవు.

"ఏమే బామినీ! ఇక్కడ పెట్టిన గాజులు ఏవే?" సీరియస్‌గా అడిగింది సీతాదేవి.

బామిని ముఖంలో భయం కనిపించింది. నాకేం తెలియదమ్మా! నేను చూడలేదు అన్నట్లు సైగలు చేసింది.

ఆ రోజు ఆదివారం. సుదర్శన్ ఇంట్లోనే వున్నాడు.

"ఎప్పుడూ లేనిది ఈరోజు అది దొంగతనం చేసిందంటావేమిటే? ఎక్కడ పెట్టావో సరిగా చూడు. నీకసలే మతిమరుపు" అన్నాడు సుదర్శన్.

"లేదండీ! డ్రెస్సింగ్ టేబుల్ మీదే పెట్టాను" అని నమ్మకంగా చెప్పింది సీతాదేవి.

బామిని భయం భయంగా, అయోమయంగా అందరివంకా చూస్తోంది.

"దొంగ దొంగతనం చేశానని ఒప్పుకుంటుందా? పోలీసుల్ని పిలవండి. అంతా బైటకొస్తుంది" అన్నాడు రామ్మోహనరావు.

పోలీసుల పేరెత్తగానే బామిని ఏడవడం మొదలుపెట్టింది. సుదర్శన్ జాలిగా చూస్తున్నాడు ఆ పిల్లవైపు.

"అది చేసుండదులేరా! దాన్ని హడలు కొట్టకు" అన్నాడు సుదర్శన్.

"నీకేం తెలియదు. ముఖం చూసి గుణం చెప్పలేం. నువ్వు ముందు పోలీసులకు ఫోన్ చెయ్యి" అన్నాడు రామ్మోహన్‌రావు.

బామిని ఏడుస్తూ తను దొంగతనం చెయ్యలేదని సీతాదేవికి సైగలతో చెప్పి నమ్మించడానికి చూస్తోంది.

సుదర్శన్ ఫోన్ చేశాడు. అరగంట తర్వాత పోలీస్ జీప్ ఇంటి ముందు ఆగడం చూసి రామమోహనరావు, వాళ్ళకి ఎదురెళ్ళి యస్సైతో మాట్లాడాడు. ఇద్దరు కానిస్టేబుల్స్, యస్సై లోపలకు వచ్చారు.

"ఏం జరిగిందమ్మా?" అని యస్సై సీతాదేవిని ప్రశ్నించాడు.


సీతాదేవి జరిగింది చెప్పింది.

యస్సై బామిని వైపు తీవ్రంగా చూశాడు.

"ఇంకెవరు తీస్తారమ్మా! ఇదే తీసి వుంటుంది. ఎన్ని

కేసులు చూడలేదా? నేను నిజం కక్కిస్తాను. చూస్తుండండి" అంటూ లాఠీ పట్టుకుని బామిని దగ్గరకు అడుగులు వేశాడు.

యస్సై తన మీదకు లాఠీతో వస్తూ వుండడం చూసి





పులి ముందు మేకపిల్లలా గజగజ వణికింది బామిని. ముచ్చెమటలు పోస్తున్నాయి. భయంతో ఆమె మెదడు మొద్దుబారిపోయింది. యస్సై లాఠీ ఎత్తీఎత్తకముందే అతని కాళ్ళమీద పడిపోయింది.

"సార్! నాకేం తెలీదు. నేనా గాజులు తియ్యలేదు" అన్నది బామిని ఏడుస్తూ.

మూగకు మాటొచ్చింది. సుదర్శన్, సీతాదేవి షాక్ తిన్నట్లయిపోయారు. రామ్‌మోహనరావు పక పక నవ్వాడు. యస్సై దగ్గరికి వచ్చి షేక్‌హాండ్ ఇచ్చాడు.

"యస్సైగారూ! మీకు శ్రమ ఇచ్చినందుకు సారీ! నిజానికి గాజులు పోలేదు. దీని బండారం బైట పెట్టించడానికే నేను ఈ నాటకం ఆడించాను. ఇది మూగదానిలా ఎందుకు నటిస్తున్నదో కనుక్కోండి" అన్నాడు రామమోహనరావు.

బామిని బిత్తరపోయింది. ఏడుస్తూ పారిపోబోతుంటే కానిస్టేబుల్స్ పట్టుకుని ఆపారు.

"దీన్ని పనిలో పెట్టింది ఎవరో చెప్పండి. అన్నీ బైటకు వస్తాయి" అన్నాడు యస్సై.

షాక్ నుంచి తేరుకున్న సుదర్శన్, ఆమెను ఎదురు అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మేన్‌గా పనిచేస్తున్న రమణయ్య పెట్టినట్లు చెప్పాడు. కానిస్టేబుల్ వెళ్ళి రమణయ్యను పట్టుకొచ్చాడు. వాడిని రెండు తగిలించేసరికి నిజం చెప్పాడు.

మూగపిల్లను పనిలో పెట్టించింది ఆ ఏరియాలో రౌడీ యూసఫ్. తనకి ఏం తెలియదు. అది మూగపిల్లని నమ్మి సుదర్శన్ ఇంట్లో పనికి పెట్టించాడు.

తీగలాగితే డొంక కదిలింది. యూసఫ్‌ని పట్టుకొస్తే నిజం కక్కాడు. తమది ఇళ్ళల్లో దొంగతనాలు చేసే గ్యాంగ్. ముందుగా పనిపిల్లను మూగది అని చెప్పి ప్లాంట్ చేస్తారు. ఇంట్లో వాళ్ళు ఆ పిల్ల మూగది అని నమ్మి డబ్బు లావాదేవీలు స్వేచ్ఛగా మాట్లాడుకుంటారు. ఇంట్లో పెద్ద మొత్తంలో డబ్బు చేరినప్పుడు ఆ పిల్ల కనిపెట్టి యూసఫ్‌కి సమాచారం ఇస్తుంది. సమయం చూసి వాళ్ళు ఎటాక్ చేసి దొంగతనం చేస్తారు.

"చూశారా! ఈ మూగపిల్ల వెనుక ఎంత కథ వున్నదో? ఈ రోజుల్లో ఎన్నో మోసాలు జరుగుతున్నాయి. అందులో ఇదొక రకం. ఎక్కువ దొంగతనాలు ఇంట్లో పనివాళ్ళిచ్చే సమాచారంతోనే జరుగుతున్నాయి. పనివాళ్ళ విషయంలో అప్రమత్తంగా వుండాలి" అన్నాడు యస్సై.

సుదర్శన్‌కి మూర్ఛపోయినంత పనయింది.

"ఆ పిల్లకి మాటలొచ్చనీ, మూగది కాదనీ, నువ్వెలా కనిపెట్టావురా?" అని రామ్‌మోహన్ని అడిగాడు.

"ఇది కామన్‌సెన్స్ పాయింట్. మూగవేరు, చెవిటి వేరు కాదు. పుట్టిన పిల్లలకు చెవుడు వుంటేనే వాళ్ళు మూగవాళ్ళవుతారు. మనం మాట్లాడే మాటలు వాళ్ళకి వినపడవు గనుక మాటలు నేర్చుకోలేరు. మాట్లాడలేరు. అంటే ఎవరైనా చెవుడు, మూగ రెండూ కలిగి వుంటారు. చెవుడు లేని మనిషి మూగగా వుండడం అసాధ్యం. నేను ఈ పిల్ల మన మాటలు చక్కగా వింటూ అన్ని పనులూ చేస్తున్నప్పుడే అనుమానించాను. మీకు మాటలతో చెప్తే నమ్మరు. అందుకే ఈ నాటకం" అని నవ్వాడు రామమోహన్‌రావు.

★